## క్లుప్తంగా

### ఘనంగా అయ్యప్పస్వామి పల్లకీ సేవ



పల్లకీ సేవలో అయ్యప్ప భక్తులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని చిన్నరంగాపురం గ్రామ సమీపంలోని శ్రీహరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయంలో గురువారం రాత్రి గురుస్వామి వెంకట్రామిరెడ్డి అయ్యప్పస్వామి పల్లకీ సేవ వైభవంగా నిర్వహించారు. అయ్యప్పమాల ధరించిన భక్తులు అయ్యప్పస్వామి పల్లకీని ఎత్తుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అయ్యప్ప శరణుఘోష మధ్య పల్లకీ సేవ నిర్వహించారు. అనంతరం ఆలయంలో తాళాల భజన, పడిపాట, హరిహరాసనం చేపట్టారు. భక్తులకు అల్పాహార బిక్ష ఏర్పాటు చేశారు.

### వ్యవసాయ కార్యాలయాన్ని వినియోగంలో ఉంచాలి



వ్యవసాయ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

వల్లూరు( చింతకొమ్మదిన్నె) : చింతకొమ్మదిన్నె మండల వ్యవసాయ కార్యాలయాన్ని ప్రజలకు వినియోగంలోకి తీసుకురావాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాలకృష్ణయ్య తెలిపారు. గురువారం రైతుసంఘం నాయకులతో కలసి ఆయన వ్యవసాయ కార్యాలయాన్ని పరిశీలించారు. కార్యాలయం మూసివేసి ఉండటంతో ప్రజలు, రైతులు వెనుతిరిగి వెళ్తున్నారని, ఉన్నతధికారులు స్పందించి మండల వ్యవసాయ కార్యాలయాన్ని ప్రజలకు వినియోగంలోకి తీసుకురావాలని, లేని పక్షంలో రైతులతో కలసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

### ఘనంగా గ్రామోత్సవం



వేలం పాటలో లడ్డూను దక్కించుకున్న దేవిరెడ్డి పరమేష్

పులివెందుల రూరల్ : మండలంలోని కొత్తపల్లిలో గురువారం అయ్యప్పస్వామి గ్రామోత్సవాన్ని గురుస్వాములు వెంకటరామిరెడ్డి, శ్రీనివాసులురెడ్డిల ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం గ్రామస్తుల సహకారంతో అయ్యప్ప భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామోత్సవం సందర్భంగా అయ్యప్పస్వామి దగ్గర లడ్డూ వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో నల్లగొండవారిపల్లె గ్రామానికి చెందిన దేవిరెడ్డి పరమేష్ రూ.40 వేలకు పాడి దక్కించుకున్నాడు. సాయంత్రం కోలాటాలు, డప్పు వాయిదాల మధ్య దీప కాంతుల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు.

### ఏపీజీబీ ప్రధాన కార్యాలయం తరలించవద్దు




బ్యాంక్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం, సీఐటీయూ నాయకులు

జమ్మలమడుగు : జిల్లా కేంద్రంలో ఉన్న ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించడం విరమించుకోవాలని సీపీఎం, సీఐటీయూ నాయకులు గురువారం స్థానిక ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ఎదుట ధర్నా నిర్వహించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 1976లో ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను ఏర్పాటు చేసిందన్నారు. దక్షిణ ఆంధ్రప్రదేశ్‌లో సెంటర్‌పాయింట్ అయిన కడపలో దశాబ్దాలుగా ఉంటూ వెనుకబడిన రాయలసీమ ప్రాంత అభివృద్ధికి అత్యంత సమర్థవంతంగా పనిచేస్తోందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం కడప నుంచి ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించే ప్రయత్నం మానుకోవాలని సూచించారు. ప్రతి విషయంలో రాయలసీమ ప్రాంతానికి తీరని అన్యాయం జరుగుతుందన్నారు. అనంతరం బ్యాంక్ మేనేజర్‌కు, ఆర్డీఓ సాయిశ్రీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకుడు ఏసుదాసు తదితరులు పాల్గొన్నారు.

### పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

వీరపునాయునిపల్లె : మండలంలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్ రెడ్డి తెలిపారు. గురువారం బీజేపీ మండల అధ్యక్షుడు గవేశ్వర్‌యాదవ్ అధ్యక్షతన స్థానిక జీఎస్ఆర్ ఫంక్షన్ హాలులో క్రియాశీలక సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చూపించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ముస్తాబైన ఆటస్థలం

- రూ.50 లక్షల ప్రభుత్వ నిధులు సరిపోవన్న కాంట్రాక్టర్
- రూ.లక్ష పీఎంశ్రీ నిధులు, దాతల సహాయంతో పూర్తి చేసిన గండి గురుకులం పీడీ ఎల్లారెడ్డి



దాతల సహకారంతో అందంగా తయారు చేసిన ఆట స్థలం

చక్రాయపేట : గండికి సమీపంలోని గండి గురుకులం పాఠశాలకు వెనుక వైపు ఉన్న మూడు ఎకరాల స్థలం రాళ్ల గుట్టలు, ముళ్లపొదలతో నిండి ఉండేది. అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం గురుకులం పాఠశాల వెనుక భాగంలో ఉన్న ఈ స్థలాన్ని ఆట స్థలంగా మార్చేందుకు రూ.50 లక్షలు నిధులు మంజూరు చేసింది. అయితే కాంట్రాక్టర్ ఈ స్థలాన్ని ఆట స్థలంగా మార్చేందుకు ఈ నిధులు సరిపోవని పనులను ఆపేశారు. అయితే గురుకులం పాఠశాలలో పీడీగా పనిచేస్తున్న వైకే ఎల్లారెడ్డి ఈ ఆట స్థలాన్ని రూ.లక్ష పీఎంశ్రీ నిధులు, దాతల సహకారంతో పూర్తిచేసి అందరి మన్ననలు పొందారు.

- ఆయన పేరు వైకే ఎల్లారెడ్డి. గండి గురుకుల పాఠశాలలో పీడీగా పనిచేస్తున్నారు. పోయిన సంవత్సరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఆయన వచ్చే జూన్ మాసంలో రిటైర్డ్ కాబోతున్నారు. వయసు మీద పడ్డా విద్యార్థుల్లోని క్రీడా ప్రతిభను వెలికి తీయలనుకున్నాడు. భావితరాల్లో విద్యార్థులకు ఉపయోగంగా ఉండేదుకు ఆట స్థలాన్ని అభివృద్ధి చేసి ప్రజల మన్ననలు పొందారు.
- గండి గురుకుల పాఠశాలకు మొత్తం 28 ఎకరాల ప్రభుత్వం స్థలం ఉండేది. ఈ స్థలంలో కొంత భాగంలోనే భవణాలు నిర్మించారు. మరికొంత స్థలం ప్రభుత్వం ఆటస్థలంగా మార్చేందుకు అప్పటి తెలుగుదేశం ప్రభుతం రూ.50 లక్షల నిధులను మంజూరు చేసింది. అప్పట్లో పనులను దక్కించుకున్న వ్యక్తి అధికారులను లోబరచుకుని కొంత స్థలాన్ని మట్టి చల్లించి రోలర్ తిప్పి బిల్లులు చేసుకునే ప్రయత్నం చేశాడు. అంతలోనే ప్రభుత్వం మారింది. సదరు కాంట్రాక్టరు నాటి ప్రిన్సిపాల్‌పై వత్తిడి తెచ్చి బిల్లులు చేసుకోవడానికి సర్వవిధాలా ప్రయత్నం చేశాడు. ఈ విషయాన్ని గుర్తించిన సాక్షి వెలుగులోకి తేవడంతో అధికారులు భయపడి సదరు కాంట్రాక్టర్‌కు సహకరించలేదు. దీంతో ఆట స్థలం పనులు ఆగిపోయాయి. ఈ పనులను ఏలాగైన పూర్తి చేయాలనుకున్నాడు పీడీ ఎల్లారెడ్డి. ఇంతలో గండి గురుకులంకు పీఎంశ్రీ(ప్రైమ్ మినిస్టర్ స్కూల్స్ రైజింగ్ ఆఫ్ ఇండియా)పథకం కింద రూ.లక్ష నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో ఎల్లారెడ్డి రాళ్ల గుట్టలు, ముళ్ల పొదలతో నిండి ఉన్న స్థలంలో జేసీబీతో పనులు మొదలు పెట్టాడు. అలాగే దాతల సహకారంతో మూడు ఎకరాలను పూర్తిగా ఆట స్థలంగా మార్చేశాడు. ఎల్లారెడ్డికి క్రీడల పట్ల ఉన్న ఆసక్తితో రాష్ట్ర, జాతీయ స్థాయిలో తమ కళాశాల విద్యార్థులతో బంగారు పథకాలను సైతం తెప్పించి పాఠశాల కీర్తి ప్రతిష్టలను పెంచాడు.
- హ్యాండ్‌బాల్ పోటీల్లో నలుగురు, టార్గెట్ బాల్‌లో నలుగురు విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అలాగే సౌత్‌జోన్‌కు ఆరుగురు ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయిలో 6 గోల్డ్ మెడల్స్‌ను సాదించారు. నెట్‌బాల్‌లో రాష్ట్రస్థాయికి ముగ్గరు విద్యార్థులు ఎంపికయ్యారు. రగ్బీ పోటీల్లో అండర్ 14, 17, 19 విభాగాల్లో 5 మంది రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. అత్యా పత్యా క్రీడల్లో 12 మంది రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. గట్కా క్రీడల్లో రాష్ట్ర స్థాయిలో ఇద్దరు విద్యార్థులు రాణించి బంగారు పథకాలను సాధించారు. స్కూల్ గేం ఫెడరేషన్‌లో అండర్ 17, 19లో ఇద్దరు విద్యార్థులు రజత పథకాలను సాధించారు. వాలీ బాల్‌లో అండర్ 14 విభాగంలో ఒక విద్యార్థి రాష్ట్రస్తాయికి ఎంపికయ్యాడు. ఇలా చెబుతూ పోతే మరిన్ని క్రీడల్లో మరెందరో విద్యార్థులు రాష్ట, జాతీయస్థాయి క్రీడ పోటీల్లో పాల్గొని పాఠశాలకు పేరుతెచ్చి పెట్టారు.

**ఉద్యోగ ధర్మం**

విద్యార్థుల్లో ఉన్న క్రీడా స్ఫూర్తిని వెలికి తీయడం పీడీగా నా ఉద్యోగ ధర్మం. నావిదిని నేను నిర్వర్తించా. ఆట స్థలం విషయానికి వస్తే భవిష్యత్తులో విద్యార్థులకు మేలు కలిగేలా చేయాలన్న ఆలోచన వచ్చింది. దీంతోనే నేను దాతల సహాయం కోరా. చాలా మంది సహకరించారు. వారికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నా.

– వైకే ఎల్లారెడ్డి పీడీ, గండి బాలుర గురుకులం.



### ఆలయంలో కార్తిక దీపాలు



సాయిబాబా ఆలయంలో కార్తిక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

పులివెందుల టౌన్ : కార్తిక మాసోత్సవాన్ని పురష్కరించుకుని పట్టణంలోని పార్నపల్లె రోడ్డులో ఉన్న శ్రీషిర్డి సాయిబాబా ఆలయంలో గురువారం మహిళలు కార్తిక దీపాలు వెలిగించారు. ముందుగా సాయిబాబా ఆలయంలో మరాఠీ హారతులు ఇచ్చి మహిళలు భక్తి శ్రద్ధలతో కార్తీక దీపాలను వెలిగించి తమ భక్తిని చాటుకున్నారు. అనంతరం ఆలయంలో తాళాల భజనలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

### సభను జయప్రదం చేయండి

వల్లూరు (చింతకొమ్మదిన్నె) : ఈనెల 24వ తేదీ ఆదివారం కడప నూర్జహాన్ ఉదయం 10 గంటలకు రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కమ్యూనిస్టు పార్టీ నాయకుడు లింగమూర్తి సంస్మరణ సభను జయప్రదం చేయాలని చింతకొమ్మదిన్నె మండల ఆర్‌సీపీ కార్యదర్శి మడగలం ప్రసాద్ కోరారు. సంస్మరణ సభకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, ప్రజలు హాజరుకానున్నట్లు తెలిపారు.

## రాజ్యాంగ దినోత్సవంపై అవగాహన




మాట్లాడుతున్న హిస్టరీ అధ్యాపకుడు గంగాధర్

వేంపల్లె : స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు రాజ్యాంగ దినోత్సవంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హిస్టరీ అధ్యాపకుడు గంగాధర్ మాట్లాడుతూ రాజ్యాంగం ఏర్పడక ముందు ఉన్న రెగ్యులేటింగ్ చట్టం, భారత ప్రభుత్వ చట్టం వింటో మార్లే సంస్కరణలు, సిపాయిల తిరుగుబాటు వంటి ఎన్నో చట్టాలు గురించి పిల్లలకు వివరిస్తూ, అదే విధంగా ప్రస్తుతం రాజ్యాంగంలో ఉన్నటువంటి నిబంధనల గురించి, షెడ్యూల్స్ గురించి, హక్కుల గురించి తెలియజేశారు. ఎన్ఎస్ఎస్ పీఓ మల్లేశ్వరమ్మ మాట్లాడుతూ రాజ్యాంగం రచన కోసం వివిధ దేశాల రాజ్యాంగాలను పరిశీలించి ముఖ్యమైన విషయాలను సేకరించి రాజ్యాంగాన్ని తయారు చేశారని, మన రాజ్యాంగంలో ఉన్నటువంటి అధికారాల గురించి విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## స్వర్ణ పంచాయతీల లక్ష్యాలను నెరవేర్చాలి



టి.చదిపిరాళ్ల సచివాలయంలో స్వర్ణ పంచాయతీల సర్వేలను పరిశీలిస్తున్న డీపీఓ రాజ్యలక్ష్మీ

కమలాపురం : స్వర్ణ పంచాయతీల లక్ష్యాలను నెరవేర్చాలని డీపీఓ రాజ్యలక్ష్మీ తెలిపారు. గురువారం మండలంలోని టి.చదిపిరాళ్ల, పాచికలపాడు, సంబటూరు పంచాయతీల్లో జరుగుతున్న స్వర్ణ పంచాయతీ సర్వేలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కమిషనర్ ఆదేశాను సారం జిల్లాలో స్వర్ణ పంచాయతీల్లో చేపట్టిన సర్వేలు పక్కాగా తయారు చేయాలన్నారు. ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చేందుకు కార్యదర్శులు డేటాను అప్‌లోడ్ చేయాలన్నారు. కార్యదర్శులు ఇంటి పన్ను, నాన్ ట్యాక్స్‌లను పరిశీలించి స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో రెండు రోజుల్లోగా అప్‌లోడ్ చేయాలన్నారు. ఈఓపీఆర్‌డీ కెజియా, సర్పంచులు రామసుబ్బారెడ్డి, నాగరత్నమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆత్మహత్యాయత్నంపై విచారణ జరిపించాలి



ప్రిన్సిపాల్ తులసమ్మతో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పి.చంద్రశేఖర్

కమలాపురం : స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలకు చెందిన ఫస్టియర్ విద్యార్థిని చేసుకున్న ఆత్మహత్యాయత్నంపై విచారణ జరిపించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన కళాశాలకు చేరుకుని విద్యార్థిని ఆత్మహత్యాయత్నం గురించి ప్రిన్సిపాల్ తులసమ్మను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బుధవారం గురుకుల కళాశాలకు చెందిన ఇంటర్ విద్యార్థిని చేసుకున్న ఆత్మహత్యాయత్నానికి కారణమైన ఫిజిక్స్ టీచర్ సుభద్రమ్మను తక్షణం సస్పెండ్ చేయాలన్నారు. గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న టీచర్ల మధ్య రెండు వర్గాలు ఏర్పాటు చేసి వారి మధ్య సుభద్రమ్మ విభేదాలు సృష్టిస్తున్నారని మండి పడ్డారు. సుభద్రమ్మ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా ఉన్నప్పటి నుంచి విద్యార్థినులు ఆత్మహత్యాయత్నాలు చేస్తూనే ఉన్నారని ఆరోపించారు. ప్రస్తుత ప్రిన్సిపాల్ తులసమ్మ, సుభద్రమ్మను పిలిచేందుకు కూడా సాహసించడం లేదంటే స్కూల్‌లో ఆమె ఎంత కీలకపాత్ర పోషిస్తుందో అర్థం అవుతుందన్నారు. ఇప్పటికి అనేక ఆత్మహత్యాయత్నాలు జరిగినప్పటికి సిబ్బంది గోప్యంగా ఉంచి విద్యార్థులపైనే నెపం నెట్టి టీసీలిచ్చి ఇంటికి పంపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇద్దరు పీఈటీల మధ్య చిచ్చుకు కారణం సుభద్రమ్మనేనన్నారు. కాంపౌండ్‌లోనే అంగళ్లు పెట్టించి వ్యాపారాలు చేస్తూ ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకుంటూ దూషించుకుంటున్నారని, ఈ ప్రభావం విద్యార్థులపై పడదా? అని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ఫిజిక్స్ లెక్చరర్ సుభద్రమ్మను తక్షణమే సస్పెండ్ చేయాలని, లేని పక్షంలో ట్రాన్స్‌ఫర్ చేయాలని సీపీఐ తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

## హౌస్ హోల్డ్ మ్యాపింగ్ త్వరగా పూర్తి చేయాలి



అధికారులకు, సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ కుళాయిబాబు

వల్లూరు (చింతకొమ్మదిన్నె) : చింతకొమ్మదిన్నె మండలంలోని కొలుములపల్లె, బుగ్గలపల్లె సచివాలయాలను ఎంపీడీఓ కుళాయిబాబు ఇతర అధికారులతో కలిసి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల పరిధిలో జరుగుతున్న హౌస్ హోల్డ్ మ్యాపింగ్ సర్వే మరియు ఆధార్‌తో బ్యాంకు అకౌంట్ల అనుసంధానత జరుగుతున్న తీరును పర్యవేక్షించి, త్వరగా పూర్తి చేయాలన్నారు. గ్రామాలలో బ్యాంక్ అకౌంట్ లేని వారు ఎవరైనా ఉంటే సంబంధిత పోస్ట్ ఆఫీస్ నందు అకౌంట్ ఓపెన్ చేయించవలసినదిగా సూచించారు. సచివాలయ సిబ్బంది అందరూ కచ్చితంగా ఉదయం 10 గంటలకు, మధ్యాహ్నం మూడు గంటలకు, సాయంత్రం ఐదు గంటలకు బయోమెట్రిక్ హాజరు తప్పకుండా వేయవలెనని, గ్రామ ప్రజలు వివిధ పనుల కొరకు సచివాలయం వద్దకు వచ్చినప్పుడు వారితో వినయంగా కూర్చోబెట్టి మాట్లాడి సకాలంలో వారి పనులు పూర్తి చేయాలని, అధికారులు ఏదైనా కార్యక్రమాన్ని సూచించినప్పుడు సకాలంలో పూర్తి చేయాలన్నారు, అలాగే ఏదైనా సమస్య ఉంటే వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేసి పరిష్కారం పొందాలన్నారు.

### రేపు సత్యసాయిబాబా రథోత్సవం

పులివెందుల టౌన్ : భగవాన్ శ్రీసత్యసాయిబాబా జన్మదిన వేడుకలలో భాగంగా శనివారం పట్టణంలోని పాత సంతమార్కెట్‌లోని ఆలయంలో రథోత్సవం నిర్వహించనున్నట్లు సత్యసాయి సేవా సమితి తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. శనివారం ఉదయం నగర సంకీర్తన, కోలాట ప్రదర్శన, సత్యసాయిబాబా రథోత్సవం నిర్వహించనున్నారు. శనివారం రాత్రి బాబావారి పవళింపు సేవ ఉంటుందన్నారు. కార్యక్రమాలలో భక్తులు పాల్గొని జయప్రదం చేమాలని వారు కోరారు.

### పాఠశాల పనివేళల పెంపులో శాస్త్రీయత లేదు

వేంపల్లె : పాఠశాల పనివేళల పెంపులో శాస్త్రీయత లేదని ఏపీ ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నరెడ్డి సంగమేశ్వరరెడ్డి తెలిపారు. గురువారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మెరుగైన బోధన తద్వారా గుణాత్మక విద్య సాధన జరగాలంటే ఉపాధ్యాయుడిని ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు కేవలం బోధనకు మాత్రమే పరిమితం చేయాలన్నారు. బోధనేతర కార్యక్రమాలతో ఒకవైపు ఉపాధ్యాయుడిని బోధనకు దూరంగా ఉంచుతూ పని వేళలు పెంచడంవల్ల ఉపయోగంలేదన్నారు. చాలా ఉన్నత పాఠశాలలకు విద్యార్థినులు దాదాపు 5కి.మీ నుంచి 10కి.మీ వరకు ఆటోలు ద్వారా, బస్సుల ద్వారా ప్రయాణం చేసి వెళుతున్న పరిస్థితుల్లో ఒక వేళ ఐదు గంటలకు పాఠశాల ముగిస్తే వారు క్షేమంగా, రక్షణగా చీకటి పడేలోపు ఆటోలలో, బస్సుల్లో ఇళ్లకు చేరుకోవాలనే అంశంపైన కూడా దృష్టి పెడితే, ఆ దిశగా అధికారులు ఆలోచిస్తే బాగుంటుందని తెలిపారు.

### అనాథ వృద్ధులకు అన్నదానం



అనాథ వృద్ధులకు భోజనం వడ్డిస్తున్న వెంకటరమణారెడ్డి దంపతులు

వేంపల్లె : స్థానిక రాజీవ్‌నగర్ మదర్ థెరిస్సా అనాథ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. గురువారం స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ వెన్నపూస వెంకటరమణారెడ్డి, సౌజన్య దంపతుల పెళ్లి రోజు సందర్భంగా అనాథ వృద్ధులకు అన్నదానంతోపాటు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకుడు వెంకట సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

### కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాల్సిందే

చాపాడు : శ్రీభాగ్ ఒప్పందం ప్రకారం కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాల్సిందేనని అసెంబ్లీలో కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు మందబలం ఉంది కదా అని తీర్మానం చేయడం శ్రీభాగ్ ఒప్పందాన్ని ఉల్లంఘించడమేనని వైఎస్సార్‌సీపీ నేత, ఏపీఎస్ ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి మండిపడ్డారు. గురువారం రెడ్యం మాట్లాడుతూ గతంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకూ కర్నూలులో న్యాయ రాజధానిని ఏర్పాటు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. హైకోర్టు బెంచి ఏర్పాటు ఆమోదయోగ్యం కాదని తేలిచ్చెప్పారు. రాయలసీమ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన చంద్రబాబు సీమకు అన్యాయం చేస్తున్నారన్నారు.

## రోడ్డు ఆక్రమించి నిర్మిస్తున్న కట్టడాన్ని తొలగించండి



పుల్లారెడ్డిపేటలో రోడ్డును ఆక్రమించి నిర్మిస్తున్న గోకులం షెడ్

వల్లూరు : మండలంలోని తప్పెట్ల గ్రామ పంచాయతీ పరిధిలోని పుల్లారెడ్డిపేట గ్రామంలో రోడ్డును ఆక్రమించి నిర్మిస్తున్న కట్టడాన్ని తొలగించాలని గ్రామ ప్రజలు అధికారులను కోరారు. గ్రామానికి చెందిన సగిలి పుల్లారెడ్డి అనే వ్యక్తికి గోకులం షెడ్ మంజూరైందని, అతడు అతని ఇంటి పక్కన వున్న స్థలంలో నిర్మిస్తున్న గోకులం షెడ్‌ను రోడ్డును ఆక్రమించి నిర్మిస్తున్నాడని వారు ఆరోపించారు. దీంతో ఈ రోడ్డులో వాహనాల రాకపోకలకు అవరోధంగా మారుతుందన్నారు. పూర్తిగా వ్యవసాయ ఆధారిత గ్రామమైన పుల్లారెడ్డిపేటతో పాటు చెరువుకిందిపల్లె గ్రామానికి ఈ దారిన నిత్యం అనేక ట్రాక్టర్లు, ఇతర వాహనాలు వెళుతుంటాయని, రోడ్డును ఆక్రమించి షెడ్‌ను నిర్మిస్తే రాకపోకలు నిలిచిపోతాయని తెలిపారు.

చెత్త లోడుతో వెళ్లే ట్రాక్టర్లు ఈ దారిని ప్రయాణించడానికి అడ్డంకిగా మారుతుందని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి ప్రాథమిక దశలో వున్న నిర్మాణాన్ని తొలగించి తమకు న్యాయం చేయాలని వారు కోరారు. ఈ మేరకు వారు కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారులకు వినతిపత్రాలను అందజేశారు.

## నేడు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బొదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24 గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న మెప్మా సిటీ మిషన్ మేనేజర్ హరిప్రసాద్‌రెడ్డి

పులివెందుల రూరల్ : మున్సిపాలిటీ పరిధిలోని వీధి విక్రయదారులందరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మెప్మా సిటీ మిషన్ మేనేజర్ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని మెప్మా కార్యాలయంలో పీఎం స్వానిధి బీ, పీఎం స్వాభిమాన్ పక్షోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ వీధివిక్రయదారుల సమగ్రాభివృద్ధికి స్వాభిమానంతో కూడిన స్వానిధి పొందాలంటే వారికోసం అమలు చేస్తున్న ఎనిమిది స్కీములలో వారు తప్పకుండా నమోదు కావాలని, వాటి ద్వారా వ్యాపారాలకు, కుటుంబాలకు సెక్యూరిటీ ఉంటుందన్నారు. డిజిటల్ ట్రాన్సక్షన్ క్యూఆర్ కోడ్ స్కానర్ల వలన ఉపయోగాలు, డిజిటల్ ట్రాన్సాక్షన్ వలన వారికి ఇంట్రెస్ట్, సబ్సిడీ వస్తుందన్నారు. ప్రధానంగా సోషల్ సెక్యూరిటీ స్కీముల ద్వారా పీఎం సురక్ష బీమా యోజన, పీఎం జన సురక్ష యోజన, భవన నిర్మాణ కార్మికుల ఇన్సూరెన్స్ పీఎం మాతృత్వ వందన యోజన, ఆయుష్మాన్ భారత్, పీఎంజేజేబీవై తదితర పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ అరవిందకుమార్, లేబర్ డిపార్ట్‌మెంట్ అల్లాబకాస్, సిటీ లెవెల్ మోడల్ ఆఫీసర్లు, మెప్మా సీఈఓలు నాగలక్ష్మి, రామాంజనేయులు, డీఈవో విజయలక్ష్మి, టీఎల్ ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

## మైలవరం దక్షిణ కాలువకు గండి



దక్షిణ కాలువకు గండి పడటంతో వృథాగాపోతున్న నీరు

జమ్మలమడుగు : మైలవరం దక్షిణ కాలువకు గండ్లు వేయడంతో నీరంతా పంట పొలాల్లోకి చేరుతోందని పొన్నతోట, నర్సోజి కొట్టాల గ్రామానికి చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూ డురోజుల క్రితం దప్పెర్ల–నర్సోజి కొట్టాల గ్రామాల మధ్యలో ఉన్న మైలవరం దక్షిణ కాలవకు ఉన్న గోడలను గుర్తుతెలియని వ్యక్తులు పూర్తిగా తొలగించడంతో నీరంతా పంట పొలాల్లోకి వెళ్లిపోతుంది. అటువైపు 70 ఎకరాల పంట పొలాలు ఉన్నాయని రైతులు సంబంధిత అధికారలకు తెలిపారు. స్పందించిన మైలవరం డీఈ కృష్ణమూర్తి మాట్లాడుతూ వీలైనంత త్వరగా మరమ్మతుపనులు చేసి నీరు వృథాకాకుండా చేస్తామన్నారు. దీనికి రైతులు సహకరించాలన్నారు.

## బహిరంగ మార్కెట్ విలువ చెల్లించాలి



తహసీల్దార్ లక్ష్మిదేవికి భూముల ధరలను వివరిస్తున్న రైతులు

వీరపునాయునిపల్లె : రాయచోటి నుంచి చాగలమర్రి వరకు చేపట్టనున్న హైవే రహదారి పనుల్లో రైతులు కోల్పోతున్న భూములకు బహిరంగ మార్కెట్ విలువ చెల్లించాలని భూములు కోల్పోతున్న రైతులు కోరారు. గురువారం తహసీల్దార్ లక్ష్మిదేవి వీరపునాయునిపల్లె, ఎస్.పాలగిరి, తంగెడుపల్లె గ్రామాల్లో భూములు కోల్పోతున్న రైతులతో గ్రామసభలు నిర్వహించి మాట్లాడారు. మూడు క్యాటగిరిలుగా ధరలు నిర్ణయించామన్నారు. వ్యవసాయ భూములు, రహదారికి పక్కన భూములు, ఇళ్ల పట్టాలకు వేరు వేరుగా ధరలు ప్రకటించినట్లు ఆమె తెలిపారు. వ్యవసాయ భూములకు ఒక్కో ఎకరానికి రూ.5.50 లక్షలు, రహదారికి పక్కన భూములకు రూ.11 లక్షలు, ఇళ్ల పట్టాలకు సంబంధించిన భూములకు రూ.64 లక్షలు మంజూరు చేశామన్నారు. అనంతరం సర్వేయర్ వేమసాగర్‌రెడ్డి భూములు కోల్పోతున్న రైతుల వివరాలను చదివి వినిపించారు. దీనిపై అభిప్రాయాలు తెలియజేయాని తహసీల్దార్ రైతులను కోరారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో రోడ్డుకు దూరంగా ఉన్న భూములు రూ.30 లక్షలు, రహదారికి పక్కన ఉన్న భూములు రూ.80లక్షలు, ఇళ్ల పట్టాలకు సంబంధించిన భూములు సెంటు రూ.2 నుంచి రూ.4 లక్షలు ధర పలుకుతోందని ప్రభుత్వం తక్కువ ప్రకటించడం చాలా దారుణమని రైతులు వాపోయారు. ప్రభుత్వం ప్రకటించిన రేటుకు భూములు ఇచ్చేందుకు సిద్ధంగా లేమని రైతులందరూ ముక్తకంఠంతో తహసీల్దార్‌కు విన్నవించుకున్నారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ మీ సమస్యలను జిల్లాస్థాయి అధికారుల దృష్టికి తీసుకెలుతానన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ వరకుమార్, వీఆర్వో దొరబాబు, పంచాయతీ కార్యదర్శి నాగభూషన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## పోషణ లోపంతో పశువులకు వ్యాధులు

చాపాడు : మండల పరిధిలోని వెదురూరు గ్రామంలో గురువారం ప్రొద్దుటూరు పశు వైద్య కళాశాల, స్థానిక పశు వైద్యాధికారి డా.మహమ్మద్ గౌస్ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి మాట్లాడుతూ పశువుల పాక పరిశుభ్రంగా లేకపోతే గర్భకోశ సమస్యలు వస్తాయన్నారు. పోషణ లోపం వలన వ్యాధులు అధికమై రైతులు తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితులు తలెత్తుతాయన్నారు. ఈ శిబిరంలో వివిధ గర్భకోశ సమస్యలతో ఇబ్బంది పడుతున్న 120 పశువులు, జీవాలు, కోళ్లకు చికిత్స అందించారు. రైతులకు మినరల్ మిక్చర్, కాల్షియం టానిక్ మందులను అందించారు. కార్యక్రమంలో పశు వైద్య కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.